క్లుప్తంగా

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం



గుబ్బలపాలెంలో పైప్ లైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గూడపల్లి గుబ్బలపాలెం గ్రామంలో జల్‌జీవన్ పథకంలో నూతనంగా ఏర్పాటు చేయ నున్న పైప్‌లైన్ పనులకు భూమి పూజ నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఇంటింటికీ ఉచితంగా పైప్‌లైన్లు వేసి తాగునీటిని అందించామన్నారు. రాజోలు దీవిలో చుట్టూ ఉప్పునీటి ప్రభావం ఉన్న పరిస్థితుల్లో గత ప్రభుత్వాల హయాంలో 20 శాతం గృహాలకు మాత్రమే తాగునీరు అందితే ప్రస్తుత ప్రభుత్వం నూరు శాతం గృహాలకు తాగునీటిని అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన శేషవేణి, నాయకులు యల్లమిల్లి రామారావు, ఉల్లూరి శ్రీను పాల్గొన్నారు.

సాగునీటిని చెరువులకు వినియోగించవద్దు

మలికిపురం: మండలం గూడపల్లిలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ పర్యటించారు. వ్యవసాయ పొలాలకు సంబంధించిన నీటి సమస్యపై ఆయన గూడపల్లి ప్రజలతో రైతులతో మాట్లాడారు. కూనవరానికి చెందిన ఆక్వారైతు నీటి ఇంజిన్ల ద్వారా రాత్రి సమయంలో రొయ్యల చెరువులకు అక్రమంగా తోడుకుంటున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అక్రమ ఇంజిన్లను పరిశీలించారు. ఆ రైతుని పిలిచి ఇంజిన్లు తీసేయాలని సూచించారు.

జగనన్న పాల వెల్లువపై అవగాహన

అయినవిల్లి: గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గ్రామంలో పాలవెల్లువలో భాగంగా సంఘాల ఏర్పాటు, పాడి రైతులకు అందించే పథకాలు, లబ్ధిపై సర్పంచ్ కాకర శ్రీనివాస్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు, ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు, డ్వాక్రా మహిళ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బంగారునాయుడికి సత్కారం

పి.గన్నవరం: రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ కమిటీ కార్యదర్శిగా నియమితులైన కె.ఏనుగుపల్లి సర్పంచ్ తోలేటి బంగారునాయుడిని శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద గ్రామ నాయకులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ కొల్లి సూర్యనారాయణ, జీజీవీకే కుమార్, ప్రసాద్, యల్లమెల్లి సత్యనారాయణ, బసుదా శ్రీనివాసరావు, శేరు సత్యనారాయణ, పుచ్చకాయల చిట్టిబాబు, బోనం అబ్బులు, సానబోయిన లక్ష్మి, కాంత్రేగుల శ్రీను, కత్తుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆర్వో, జిల్లా జేసీ సూచనల మేరకు స్థానిక అధికారులు ఎలక్షన్ ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై ప్రదర్శన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నం.45 రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సఖినేటిపల్లి మండలానికి సంబంధించిన మహిళా పీవోలు, ఏపీవోలకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో బదుగు మంగాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్ వీటిపై వివరిస్తూ మహిళా ఉద్యోగినులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సిమెంట్ రోడ్లకు నిధుల మంజూరు

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణానికి రూ.31 లక్షలు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శుక్రవారం తెలిపారు. మామిడికుదురు మండలం మాకనపాలెంలో సీసీ రోడ్డుకు రూ.3 లక్షలు, మొగలికుదురులో సీసీ రోడ్డుకు రూ.4 లక్షలు, పెదపట్నంలంక లంకపేటలో సీసీ రోడ్డుకు రూ.3 లక్షలు, అప్పనపల్లి ఉచ్చులవారిపేట న్యూ కాలనీలో సీసీ రోడ్డుకు రూ.4 లక్షలు, పాశర్లపూడిలో చింతలమెరక సీసీ రోడ్డుకు రూ.17 లక్షలు మంజూరయ్యాయని చిట్టిబాబు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడతామన్నారు.

సీసీ రోడ్డుకు మోక్షం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో రూ.5.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న ఈరోడ్డు పనులను సర్పంచ్ దంగేటి చంద్రకళ, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి తదితరులు శుక్రవారం పనులను పరిశీలించారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఈ రోడ్డును స్థానిక పంచాయతీ పాలకవర్గం చేపట్టడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ ఎంపీపీ తోరాటి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

- జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు
- 20 కుటుంబాలు పార్టీలో చేరిక



కె.పెదపూడిలో పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు



వైఎస్సార్ సీపీలో చేరిన ప్రతిపక్ష పార్టీల యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అంబాజీపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేసి విజయానికి కృషి చేయాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. కె.పెదపూడి, పుల్లేటికుర్రు గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన పార్టీ సమావేశం, పార్టీలో చేరికల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇన్‌చార్జి వేణుగోపాలరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను, లబ్ధిని ప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి వేణుగోపాలరావును, నూతనంగా నియమితులైన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్ర శేఖర్, సీనియర్ నాయకుడు నేలపూడి స్టాలిన్‌బాబులను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, నీతిపూడి రమణ, వాసర్ల మరిడి, కుడుపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కె.పెదపూడికి చెందిన 20 కుటుంబాల వారు బీర రావులు, చిల్లే ధనరాజ్, చిత్రపు సుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో ఇన్‌చార్జి వేణుగోపాలరావు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వాటి అమలును చూసి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీకి వాడవాడలా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. రాజులపాలెం గ్రామంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు కుటుంబాల వారు విప్పర్తి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన అల్లు భీమయ్య, బొమ్మిరెడ్డి చిన్న తదితరులకు విప్పర్తి వైఎస్సార్ సీపీ కండువాలు వేశారు. సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, నాయకులు గిడ్డి రాంబాబు, అడ్డగళ్ల శ్రీను, కుంపట్ల నాగప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో భారీ చేరికలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీలకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. టీడీపీ, జనసేన అనైతిక పొత్తుపై ఆయా పార్టీల నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. దిశ నిర్దేశం లేని ఆ పొత్తు పార్టీల్లో ఇమడలేక వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలన, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధి, కార్యకర్తలపై చూపుతున్న ఆదరణకు ఆయా గ్రామాల యువకులు పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారు. దీంతో వైఎస్సార్ సీపీకి మండలంలో రోజురోజుకూ మరింత విశేష ఆదరణ పెరుగుతుంది. పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, పార్టీ నేత తోరాటి గోవిందు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 150 మంది యువకులు రావులపాలెం మండలంలోని గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో పార్టీలో శుక్రవారం పార్టీలో చేరారు. ఆయన వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలోని నాయకులు, కార్యకర్తలందరికీ తగిన ప్రాధాన్యతను ఇస్తూ అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. సీఎం జగన్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేస్తున్న కృషికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు సంధిపూడి యువకులు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో గుత్తుల క్రాంతి కుమార్, టేకుమూడి రమేష్, మీసాల దుర్గారావు, కోట సుధాకర్, సీహెచ్.తాతాజీ, ఒ.యేసు, గుబ్బల నారాయణ, మన్యం నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్సార్



రాజులపాలెంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి

పి.గన్నవరం: పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన దివంగత రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని రాజులపాలెంలో స్థానిక నాయకుడు గూటం గంగాధరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విప్పర్తి మాట్లాడారు. రాజశేఖరరెడ్డి పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఆయన కుమారుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధిలో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారని విప్పర్తి వివరించారు. పార్టీ జిల్లా వాణిజ్య విభాగం నాయకుడు మంతెన రవిరాజు, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వడలి కొండయ్య, సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మి ప్రసాద్, ఎంపీటీసీ పుల పర్తి రాజారావు, నాయకులు నక్కా గోపి, గుత్తుల మధు, గుత్తుల దాసు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో పరిపాలన వికేంద్రీకరణ



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

రాజోలు: పరిపాలన వికేంద్రీకరణతో క్షేత్రస్థాయిలో అనేక సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం తాటిపాకలో నూతనంగా రూ.25 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయం-1 భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభించారు. సర్పంచ్ కోటిపల్లి రత్నమాల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో పరిపాలన రూపురేఖలను పూర్తిగా మార్చేశారన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ మాట్లాడుతూ బడుగు, బలహీన, దళిత వర్గాలకు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అండగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో విజయ ఢంకా మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీటీసీ కట్టా మోహనకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబూరావు, తెన్నేటి కిశోర్, గ్రామశాఖ అధ్యక్షుడు మెడబల రాజ్‌కుమార్, బొంతు రమేష్, నీతిపూడి చిన్ని, మట్టా ఏడుకొండలు, మద్దుల కాసు బాబు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రాజెక్టుకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఈవో, ఏపీసీ తదితరులు

కొత్తపేట: ప్రతి విద్యార్థిలో ఉండే సృజనాత్మకత, వినూత్న ఆలోచనలకు ఉపాధ్యాయులు పదును పెట్టడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావులు పిలుపునిచ్చారు. కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఈఎండీపీ) జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం గోపాలరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఈవో కలమకుమారి, ఏపీసీ మధుసూదనరావులు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా విద్యార్థులను ఉత్పాదక రంగాలవైపు మళ్లించడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఈఎండీపీ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. జిల్లా స్థాయిలో ఆయా పాఠశాలల విద్యార్థులు సబ్మిట్ చేసిన ప్రాజెక్టుల నుంచి 10 ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ బి.హనుమంతురావు, సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, మండల విద్యాశాఖాధికారి మట్టపర్తి హరిప్రసాద్ తదితరులు మాట్లాడారు. ప్రాజెక్టుల ప్రదర్శనలో మండపేట శ్రీగౌతమి ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన హోమ్ సర్వీస్ ఎక్స్‌పర్ట్, అమలాపురం మండలం పాలగుమ్మి ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన పర్యాటక ప్రదేశాల కోనసీమ యాప్ రాష్ట్ర ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. అలాగే జెడ్పీహెచ్ఎస్ జి.అగ్రహారం, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల అమలాపురం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కొత్తపేట విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు క్రిష్టోఫర్, శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరాచక శక్తులకు టీడీపీలో అగ్రస్థానం



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వేణుగోపాలరావు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు స్టాలిన్‌బాబు

అంబాజీపేట: టీడీపీలో అరాచక శక్తులకు అగ్రస్థానం కల్పించి, ఘర్షణలు, విద్వేషాలను రెచ్చగొడుతుందని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు నేలపూడి స్టాలిన్ బాబు ఆరోపించారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన తర్వాత తొలిసారిగా అంబాజీపేటలో ఆయన స్వగృహంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు సంపూర్ణంగా అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు, పార్టీ అభివృద్ధి పనులు, జగనన్న నాయకత్వానికి ఆకర్షితుడినై వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. తొలుత జెడ్పీ చైర్మన్, ఇంచార్జి విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ స్టాలిన్‌బాబు లాంటి నాయకుడు పార్టీలో చేరడం వల్ల పార్టీకి మరింత ఉత్సాహం వచ్చిందన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీను, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, మైలా ఆనందరావు, రాయుడు షన్ముఖ్, పులిదిండి ఏడుకొండలు, కాంత్రేగుల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ ఫెస్ట్‌లో పది మందికి ఉద్యోగాలు



ఉద్యోగావకాశాలు పొందిన కొత్తపేట డిగ్రీ కళాశాల విద్యార్థులతో జాబ్ ఫెస్ట్ నిర్వాహకులు

కొత్తపేట: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన జాబ్ ఫెస్ట్-2024 ద్వారా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 10 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు గురువారం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు జాబ్ ఫెస్ట్ నిర్వహించినట్టు తెలిపారు. దీనికి 20 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా తమ కళాశాల నుంచి ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ టి.రమాదేవి ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న 62 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో జె.రాజా, ధనలక్ష్మి, రత్నకుమారి, నాగధనసుందరి, దేవిక, లక్ష్మీనారాయణ, అంజిరెడ్డి, జగపతి వీర, నరేంద్రకుమార్, మహేష్‌బాబు వివిధ కంపెనీలకు ఎంపికైనట్టు తెలిపారు. ప్లేస్మెంట్స్ పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పెద్దిరాజు, జేకేసీ కోఆర్డినేటర్ డా జి.శ్రీనివాసులు, అధ్యాపకులు సీహెచ్ పాపారావు, సీహెచ్ నాగశ్రీలక్ష్మి, ప్రసన్నజ్యోతి, జానకిరామ్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

హోల్‌సేల్ ఫ్యాన్సీ షాపు దగ్ధం

రాజోలు: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న కనకం ఫ్యాన్సీ హోల్‌సేల్ షాపు శుక్రవారం అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా షాపులో మంటలు వ్యాపించి ఒక్కసారిగా చెలరేగాయని స్థానికులు తెలిపారు. షాపులో ఉన్న ప్లాస్టిక్ వస్తువులతో పాటు కిరాణా సామగ్రి కాలిపోవడంతో దట్టమైన పొగతో పాటు అగ్నికీలలు చుట్టుపక్కల ప్రాంతానికి వ్యాపించాయి. రాజోలు అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే మంటల ఇతర షాపులకు వ్యాపించకుండా ఉండేందుకు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు అగ్నిమాపక కేంద్రం ఏడీఎఫ్ఓ జానకిరామయ్య ఆధ్వర్యంలో సిబ్బందితో పాటు నగరం ఓఎన్జీసీ అగ్నిమాపక వాహన సిబ్బందిని రప్పించి సేవలు వినియోగించారు. సుమారు మూడు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగిందని రాజోలు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి.బాలకృష్ణ తెలిపారు.

ప్రతి ఎకరానికీ సాగునీరు అందాలి



న్యూ వాడపాలెం చానల్‌లో వ్యర్థాలు తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న నాయకులు, ఎస్ఓ

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) సీజన్‌లో చానల్స్ శివారులో ప్రతి ఎకరానికి సమృద్ధిగా సాగునీరు అందాలని, ఆ దిశగా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ దాళ్వా సీజన్‌లో వాడపాలెం లాకు పైన ఓల్డ్ వాడపాలెం, న్యూ వాడపాలెం చానల్స్ కింద రైతులు సుమారు 1600 ఎకరాలు వరి పంట సాగు చేస్తున్నారని, అయితే ప్రధానంగా న్యూ వాడపాలెం చానల్‌లో తూటు, వ్యర్థాలు పేరుకుపోవడంతో సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, పంట తయారయ్యే స్థితిలో సాగునీరు ఇబ్బంది వస్తుందని ఏఎంసీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, వాడపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి, రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు తదితరులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దానిపై ఆయన ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఎస్టిమేషన్ వేసి, నిధుల కోసం ఎదురు చూడకుండా వెంటనే జేసీబీ ద్వారా తూటు, వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ కొత్తపేట సెక్షన్ ఆఫీసర్ వి.నవీన్‌కుమార్‌కు సూచించారు. దానికయ్యే మొత్తం నిధులు తానే చెల్లిస్తానని చెప్పారు. ఆ మేరకు శుక్రవారం ఆ పనులను పై నాయకుల పర్యవేక్షణలో చేపట్టారు. స్థానిక నాయకులు, రైతులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన భక్తులు



చింతలూరులో దేవతామూర్తులను గరుడ వాహనంపై ఊరేగిస్తున్న భక్త జనం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న తొలి వార్షిక పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దేవతామూర్తుల విగ్రహాలను గరుడ వాహనంలో ఉంచి ఊరేగించారు. అలాగే వేద పండితులు వాడపల్లి గోపాలాచార్యులు, అల్లంరాజు భరణి ఆధ్వర్యంలో ఆలయ పురోహితుల బృందం వైఖానస బృందం సభ్యులు బ్రహ్మోత్సవ నిర్వహణ పూజలు నిర్వహించారు. అనంతరం అష్ట లక్ష్మి యాగం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతల సహకారంతో నిర్వాహక కమిటీ భారీ అన్న సమారాధన నిర్వహించింది. గోవింద మాల ధరించిన 52 మంది భక్తులతో పాటు వలంటీర్లు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని విశేష సేవలను అందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

జెరాక్స్ మెషీన్ బహూకరణ

అయినవిల్లి: విలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01లో చదివిన పూర్వ విద్యార్థులు శుక్రవారం రూ.32 వేలు విలువైన జెరాక్స్ మెషీన్ అందజేశారు. ఈ మెషీన్‌ను వారు పాఠశాల హెచ్‌ఎం పీవీఆర్ ప్రసాద్‌కు అందజేశారు. పూర్వ విద్యార్థులను సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్, ఎంపీపీ మట్టపర్తి విజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మామిడికుదురు: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మండలంలోని నాలుగు కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 497 మంది విద్యార్థులకు గాను, 470 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు హాజరయ్యారు. 27 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ తెలుగు పరీక్షకు జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 286 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 254 మంది హాజరయ్యారు. 32 మంది గైర్హాజరయ్యారు.

రావులపాలెం: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫస్టియర్ జనరల్ కోర్సుకు 508 మందికి 67 మంది గైర్హాజరయ్యారు. అలాగే సత్యసాయి కళాశాలలో 377 మందికి 16 మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 360 మంది విద్యార్థులకు గాను తొలిరోజు ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీ కేడర్‌ను కలసిన గొల్లపల్లి



సఖినేటిపల్లి పంచాయతీలో సూర్యారావును సత్కరిస్తున్న సర్పంచ్ చిట్టిబాబు

సఖినేటిపల్లి: రాజోలు మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు శుక్రవారం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మండలంలో గ్రామాల వారీగా పలువురు వైఎస్సార్ సీపీ కేడర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో సూర్యారావు చేరిన సంగతి విదితమే. ఈ మేరకు అంతర్వేది పాలెంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర, నాయకుడు తోటె జాన్‌బాబు, మండల యువజన అధ్యక్షుడు నల్లి సుధీర్‌లను కలిశారు. సఖినేటిపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు రుద్రరాజు రంగరాజులను ఆయన కలిశారు. సఖినేటిపల్లి పంచాయతీలో సూర్యారావును సర్పంచ్ చిట్టిబాబు సత్కరించారు. వెంట మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్ ప్రసాద్, ఆరిపల్లి సత్యనారాయణ, కత్తిమండ ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యార్థిని వైద్యానికి ఆర్థిక సాయం



కొత్తపాలెంలో కేన్సర్ బాధిత బాలిక వర్షకు నగదు అందజేస్తున్న హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయులు

కొత్తపేట: మండలంలోని బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం గ్రామంలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కాంత్రేగుల వర్ష అనే పూర్వ విద్యార్థిని వైద్యానికి అదే గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వర్ష గత ఏడాది ఆ పాఠశాలలో పదో తరగతి చదివింది. ఆ విద్యార్థినికి కేన్సర్ సోకి బాధపడుతుంది. పేద కుటుంబానికి చెందిన వర్ష తల్లిదండ్రులు తమ ఆర్థిక స్తోమతకు అనుగుణంగా ఇంతవరకూ వైద్యం చేయించారు. ఇంకా ఉన్నత వైద్యం చేయించాల్సి వుంది. తమ పాఠశాలలో చదువుకున్న వర్ష కేన్సర్ వ్యాధికి గురయ్యిందని, ఆ తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమేనని తెలుసుకున్న ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.71,180 సేకరించారు. శుక్రవారం ఉదయం వారందరూ వర్ష త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ఇంటర్మీడియెట్ పూర్తి చేయాలని భగవంతుని ప్రార్థించారు. అనంతరం హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సేకరించిన మొత్తాన్ని కేన్సర్ బాధిత వర్షకు అందచేశారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

కొత్తపేట: మనబడి నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు సూచించారు. మండలంలోని మందపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఏపీసీ మధుసూదనరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా పాఠశాలకు నిధులు మంజూరు చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం ఆర్‌వీడీ ప్రసాద్ తెలిపారు. ఇటీవలనే పాఠశాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీసీ మధుసూదనరావు పాఠశాలలో ఉన్న టాయిలెట్లు, తాగునీరు, విద్యుదీకరణ తదితర పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు ఉన్నారు.

సాగునీరు అందించాలని రైతుల రాస్తారోకో

మామిడికుదురు: సాగునీరు అందక పంట పొలాలు నెర్రలు తీశాయంటూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేశారు. 216వ నంబర్ జాతీయ రహదారిపై నిల్చుని సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ప్రస్తుతం పంట చిరుపొట్ట దశలో ఉన్న తరుణంలో సాగునీటి సమస్య ఏర్పడిందని వాపోయారు. నగరం, గెద్దాడ, పాశర్లపూడి తదితర గ్రామా ల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సమస్యను ఇరిగేషన్ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశా రు. వంతుల వారీ విధానంలో సాగునీరు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఎంతో కష్టపడి పంట పండించామని, ఈ పరిస్థితుల్లో సాగునీరు అందించపోతే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ఎం.మేరికమ్మకు వినతిపత్రం అందించారు. నిరసనలో పలువురు రైతులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

అంబాజీపేట: నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని, ఆ లక్ష్యంతోనే ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుందని అయినవిల్లి, మామిడికుదురు తహసీల్దార్లు ప్రమద్వర, ఎం.మేరికమ్మ, అన్నారు. వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించే మండలంలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు రీసోర్స్ పర్సన్లుగా సాయిరామ్, లక్ష్మీనారాయణలు వ్యవహరించి ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.